# మీరైనా చెప్పండి

రచన :
"డి. జి. కె."

(గత సంచిక తరువాయి)

'ఛీ! ఛీ!' నాపై నాకే అసహ్యం వేసింది. వెంటనే వెళ్ళి రామం ఎక్కడున్నా సరే వెదికి పట్టుకుని క్షమార్పణం కోరుకోవాలని నిశ్చయించుకున్నాను, ఉన్నపళంగా పరిగెట్టాను కారు దగ్గరకి. నౌకర్లంతా నిర్ఘాంతపోయారా కంగారు చూసి, డ్రైవరు పరుగెట్టుకొంటూ వచ్చారు కారు దగ్గరకు.

'అక్కర్లేదులే' అంటూనే నేనడుపుకుంటూ బయలుదేరాను. నిశీథ సమయం. నిర్మానుష్యమయిన వీధులలో శరవేగంతో పరుగెడుతోంది కారు. 'నా పిచ్చిగాని ఈ రాత్రివేళ వాళ్ళు నాకు ఎక్కడ దొరుకుతారు? అసలు నాకు వాళ్ళు మళ్ళీ ఈజన్మలో కనిపిస్తారా?' అనుకొంటూ మురికిపేటలోకి తిప్పాను కారును అప్రయత్నంగా. దూరంగా ఒక చిన్న గుంపు కనిపించింది. ఏమిటా అనుకుంటూ నేను పోయాను, నా కాళ్ళక్రింద భూమి తొలిగిపోయినట్టయింది. ఆ గుంపు మధ్యగా నాకు కనిపించాయి రెండు శవాలు. రామం, రమణిల శవాలు. నీటిలో నాని ఉబ్బిపోయి బావి పక్కనే పడున్న ఆ శవాలు తమ కథను తామే చెప్పుకొంటున్నాయి.

ఇంక ఆపుకోలేక పోయాను. ఆ శవాల పైబడి వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించాను. అంతా వింతగా నావైపు చూశారు. వారిలో ఒక ముసలివాడు నా దగ్గరకు వచ్చి 'మీకేమయినా అవుతారా నాయినా వాళ్లు' అని అడిగాడు.

ఔనని తల ఊపాను.

'ఏమౌతారు?'

'చాలా దగ్గరవాళ్ళు.'

'అలాగా పాపం! ఇన్నాళ్ళు తెలియలేదా నాయనా?'

కొరడాతో కొట్టినట్టయింది. ఏమీ మాట్లాడలేక పోయాను. మళ్ళీ ఏమనుకున్నారో ఏమో అతనే అన్నాడు.

'మరేమీ అనుకోబోకు నాయనా. ఆ అబ్బాయి ఇక్కడ తమ కెవ్వరూ లేరని చెప్పాడులే అందుకని. వారం రోజులయింది వాళ్ళువచ్చి తామిద్దరమూ అన్నాచెల్లెళ్ళమనీ, బ్రతికిచెడ్డవాళ్ళమనీ, ఈ ఊర్లో తమకు కావలసినవాళ్ళెవరూ లేరనీ, ఒకేఒక అన్నయ్యఉండాలి అతను ఎక్కడ ఉన్నాడోకూడా తెలియదనీ చెప్పాడు. తాను ఉద్యోగ ప్రయత్నంకోసం వచ్చాననన్నాడు. పాపం! ఎక్కడా ఉద్యోగం దొరకలేదని ఎంతబాధ పడేవాడో ఆ బాధచూసి మా ఇంట్లోనే తలదాచుకో నిచ్చాం. ఇవాళ మధ్యాహ్నం తిరిగితిరిగి వచ్చి 'ఆ అన్నయ్యకూడా చచ్చిపోయినట్టు తెలిసిందనీ, ఇంకతమ కెవ్వరూ దిక్కు లేరనీ 'చెప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు. మళ్ళా సాయంత్రం ఊరంతా తిరిగివచ్చి, ఒకచోట కూలిపని దొరికిందనీ గాని ఆ మేస్త్రీకి 10 రూ॥ లు లంచం కట్టాలనీ అన్నాడు. మాలో 10 రూ॥ లు ఎవరి దగ్గర ఉంటాయిబాబూ? ఎక్కడా దొరకలేదు. చివరకు ఆతనిబాధ చూడలేక ఆ అమ్మాయి తెగించివెళ్ళి ఒళ్ళు అమ్ముకొని తెచ్చి ఇచ్చిందా పదిరూపాయిలూనూ. ఈ సంగతి తెలుసుకొని మండిపడి ఆ అమ్మాయిని కొట్టి, తిట్టీ, ఈడ్చుకుంటూ ఇక్కడికి తీసుకువచ్చి ఈ బావిలో తోసేసి తానుకూడా ఆ వెనకనే దూకేశాడు. మేము నలుగురుం పోగుపడి బయటికి తీసేసరికే అంతా అయిపోయింది. అంటూ తనుకూడా ఏడ్వడం ప్రారంభించాడా తాత:

అంతా బోధపడింది నాకు. అవును. రామం చెప్పినది నిజం, తన ప్రాణమిత్రుడూ, సోదరులాంటివాడూ అయిన రాజు చచ్చిపోయాడు. ఏనాడో చచ్చిపోయాడు. ఇప్పుడు ఉన్నది అధికార గర్వంతో మదించిన కలక్టరు రాజు. ఇతనికి కావలసినవి ధనం, అధికారం, అధికారుల ప్రాపు. ఇతను స్నేహంచేసేది కూడా అవి పుష్కలంగా ఉన్నవాళ్ళతోనే. రామంతో ఇతనికేమి పని?

కాదురామం! కాదు. నేటినుంచీ ఈ రాజు నీ రాజే. కళ్ళు తెరిపించావు. గాని ఆ కళ్ళతో నిన్ను మళ్ళా చూసుకొనే భాగ్యం లేకుండా చేశావు. నిన్ను రక్షించలేని ఈ హోదా, ఈ ధనం, ఇవన్నీ నాకెందుకు, మీ దగ్గరకే వచ్చేస్తాను. మీతో ఉంటాను. మీ రెండు నిండు ప్రాణాల్ని పొట్టపెట్టుకున్న ఈ రాక్షసుడ్ని ఎవరూ శిక్షించరేం? ఏం 'లా' నిర్బంధించరేం? ఏమిటి నాకు శిక్ష? నా నేరానికి తగినశిక్ష ఈ ప్రపంచంలో ఉందా? ఎవరూ మాట్లాడరేం? ఏ కోర్టూ శిక్ష విధించదేం? చెప్పండి - మీరైనా చెప్పండి. ఏమిటి నాకుశిక్ష? ఏమిటి నాకు శిక్ష?